క్లుప్తంగా

ఉమారుద్రుడికి విశేష పూజలు



స్వామివారికి హారతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో నాగావళి నదీ తీరాన ఉమారుద్రకోటేశ్వర స్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పూజలు, విశేష హారతులు ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

భక్తిశ్రద్ధలతో విషు ఉత్సవం



బలగలో అయ్యప్పస్వామికి అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్ : పట్టణంలోని పలు అయ్యప్పస్వామి ఆలయాలలో కేరళ ఉగాది (విషు) వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో అర్చకులు శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామికి మూల మంత్ర విషుక్కని సమర్పణ జరిగింది. స్థానికంగా నివాసముంటున్న కేరళీయులు హాజరై స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి నూతన వస్త్రాలు, ప్రత్యేక ఆభరాణలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి చిరంజీవులు, దానేటి రాజారావు, భక్తులు పాల్గొన్నారు. పాత శ్రీకాకుళంలోని ధర్మశాస్తా ఆలయంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు, పాపారావు గురుస్వామి, భక్తులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న జైభీమ్ యువజన సంఘ సభ్యులు

హిరమండలం: రెల్లి కులస్తులకు రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ హిరమండలం మండల కేంద్రంలో జై భీమ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో న్యాయ పోరాట సమితి సభ్యులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీధర్, శంకర్ మాట్లాడుతూ జిల్లాను యూనిట్‌గా చేసి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలన్నారు. రెల్లి కులస్తులకు వర్గీకరణలో రిజర్వేషన్ శాతాన్ని పెంచాలన్నారు. కుల గణన చేపట్టిన తరువాతే వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో రెల్లి కులస్తులకు అన్యాయం చేయవద్దన్నారు. భావితరాలకు ఈ ఫలాలు అందించాలంటే వర్గీకరణలో తమకు న్యాయం జరగాలన్నారు. అంబేడ్కర్ జయంతిని సందర్భంగా పాతబస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. సంఘ సభ్యులు రమేష్, రవిరాజా, జగదీష్, విజయ్, సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఆశీల వసూళ్లు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో అక్రమంగా ఆశీలు వసూళ్లు చేయడంపై పలువురు వ్యాపారస్తులు మండిపడుతున్నారు. పంచాయతీ పరిధిలో సొంత దుకాణాలు, అద్దె దుకాణాల నుంచి రోజువారీ ఆశీలు వసూళ్లు చేస్తుండడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ప్రతిరోజూ ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చి వివిధ రకాల వస్తువులు అమ్మకాలు చేసిన వారి నుంచి మాత్రమే ఆశీలు వసూళ్లు చేసేవారు. దీనికి విరుద్ధంగా ప్రస్తుతం చిన్నపాటి దుకాణాల నుంచి ఆశీలు వసూళ్లు చేస్తుండడం గమనార్హం. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జి ఈవో శశిధర్ వద్ద ప్రస్తావించగా దుకాణాల నుంచి ఎటువంటి రోజువారీ ఆశీలు వసూళ్లు చేయకూడదని, దీనిపై సంబంధిత పాటదారులను హెచ్చరిస్తామని తెలియజేశారు.

రారండోయ్ వేడుక చూద్దాం

- నేటి నుంచి కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు
- మూడు రోజుల వార్షిక కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- ఆధ్యాత్మికతకు, ఆహ్లాదానికి చిరునామాగా నిలుస్తున్న ఆలయం



కల్యాణ వేంకటేశ్వరుని ఆలయం

శ్రీకాకుళం కల్చరల్ : కలెక్టర్ బంగ్లా సమీపంలో నాగావళి నదీ తీరానికి ఆనుకుని ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమైంది. గత పదిహేనేళ్లుగా ఆధ్యాత్మికతకు, ఆహ్లాదకర వాతావరణానికి చిరునామాగా నిలుస్తూ భక్తుల కొంగుబంగారంగా నిలుస్తోంది. ఆపద మొక్కుల వాడిగా, కోర్కెలు తీర్చే దేవుడిగా, కలియుగ దైవంగా భావించే వేంకటేశ్వర స్వామి ఇక్కడ నిత్య పూజలందుకుంటున్నారు. భక్తదాతల సహకారంతో నిర్మాణం జరిగిన ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా భాసిల్లుతోంది.

కలిసికట్టుగా నిర్మాణం..

పాత శ్రీకాకుళంలో ప్రాంతంలో వేంకటేశ్వరస్వామి ఆలయం లేకపోవడంతో స్థానిక భక్తులు, విశ్రాంత ఉద్యోగులు కలిసి కమిటీగా ఏర్పడి ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వర స్వామితో పాటు పద్మావతి అమ్మవారు, గోదాదేవి, వినాయకుడు, కుమార స్వామి, విశ్వక్సేనుడు, గరుడాళ్వార్‌లతో ఉపాలయాలను కూడా ఏర్పాటు చేశారు. ఇందుకు ఎల్.నందికేశ్వరరావు స్థలాన్ని ఉచితంగా అందించారు. నాగావళి నది చెంతన ఉండటంతో ఇక్కడి వచ్చే భక్తులకు ఈ ప్రశాంత వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

నిత్య పూజలు..

వేంకటేశ్వర స్వామివారిని నిత్యపూజలతో ఇక్కడి భక్తులు కొలుస్తున్నారు. ప్రతినెలా స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణం రోజున శ్రీదేవి, భూదేవి సహిత స్వామివారి కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. తిరుప్పావై ప్రవచనాలు, గోదా రంగనాథుల కల్యాణోత్సవం, ప్రతి శుక్రవారం లక్ష్మీపూజలు, విష్ణు సహస్రనామ పారాయణలు జరుగుతున్నాయి.

నేటి నుంచి వార్షిక కల్యాణోత్సవాలు..

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు వార్షిక నిర్వహిస్తున్నారు. 15వ తేదీ సాయంత్రం ధ్వజారోహణం, విశ్వక్సేన పూజలు, 16న స్వామివారికి విశేష పూజలు, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి తిరుక్కల్యాణోత్సవం, 17న శాంతి హోమం, పూర్ణాహుతి, చక్రస్నానం నిర్వహిస్తున్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.



శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి

నిరాటంకంగా పూజలు



ఒకప్పుడు ఈ ప్రాంతంలో వేంకటేశ్వరస్వామి ఆలయం లేకపోవడంతో నిర్మాణం కోసం స్థలాన్ని విరాళంగా ఇచ్చాను. ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ భక్తుల తాకిడి పెరుగుతూ వస్తోంది. ఇక్కడ నిత్యం స్వామివారు పూజలందుకుంటారు.

– ఎల్.నందికేశ్వరరావు, ఆలయ స్థలదాత

నిత్యం కైంకర్యాలు..



గత 15 ఏళ్లగా స్వామివారిని కొలుస్తూ నిత్యం దైవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. వార్షిక కల్యాణంతో పాటు ద్వాదశి నాడు నాగావళి నదిలో తెప్పోత్సవం, కార్తీకమాస ఉత్సవాలు వంటివి ఘనంగా జరుగుతాయి. ఈ ఏడాది కూడా ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– బెహరా నాగేశ్వరరావు, ఆలయ కమిటీ కార్యదర్శి

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



శ్రీకాకుళం కల్చరల్: బలగలో సీతారాముల కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా బలగ మెట్టు వద్ద సీతారామ మందిరంలో సోమవారం సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

జి.సిగడాం: శ్రీరామనవమి ఉత్సవాలు సందర్భంగా సోమవారం ఎస్.పి.ఆర్.పురం రామమందిరం వద్ద సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వేడుకలు జరిపించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

రణస్థలం: మండలంలోని పిషిణి పంచాయతీ పతివాడపాలెం రామాలయంలో సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, ఉషాకుమారి దంపతుల చేతుల మీదుగా సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. వసంత నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని భజనలు, పందిరి పాల, నగర సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం రెండు వేలమందికి అన్నదానం చేశారు.



జి.సిగడాం: ఎస్.పి.ఆర్.పురంలో సీతారాముల కల్యాణం



రణస్థలం: పతివాడపాలెం రామాలయంలో సీతారాముల కల్యాణం

వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యం



స్థల పరిశీలన చేస్తున్న నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరాంరెడ్డి అన్నారు. తమ్మినాయుడుపేట తోటల్లో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న మండల పార్టీ సమావేశం నిమిత్తం స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలు యూనిట్‌గా పార్టీ బలోపేతం చేస్తామన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేకపోవటం, సాగునీటి సమస్య, తాగునీటి ఎద్దడి వంటివి అధికారుల దృష్టికి తీసుకువెళ్లటం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావటంపై ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు ముద్దాడ శంకర్, మూగి శ్రీరాములు, దుంప చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనురాగ నిలయంలో అన్నదానం



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో డాక్టర్ మందుల మోహనరావు పుట్టిన రోజు పురస్కరించుకొని పిల్లలకు, వృద్ధులకు సోమవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, కనుగుల దుర్గా శ్రీనివాసరావు, లలిత, ఆశ, సాయి సుధాకర్ పాల్గొన్నారు.

ఇంటర్ టాపర్లకు అభినందన



టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులతో ప్రసాదరావు, సారిక

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని గ్లోబల్ విద్యాసంస్థల విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో అద్భుత ఫలితాలను సాధించారని చైర్మన్ ఎం.ప్రసాదరావు అన్నారు. సోమవారం నగరంలోని ఆదివారంపేటలో ఉన్న గ్లోబల్ విద్యాసంస్థలో టాపర్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యాసంస్థలో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టిన మొదటి ఏడాదే టాప్ ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందన్నారు. జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించడమే లక్ష్యంగా ఇంటర్‌విద్య ప్రవేశపెట్టినట్టు చెప్పారు. బైపీసీలో లోపింటి ధరణి 434 మార్కులతో జిల్లాలో టాప్ ర్యాంకు సాధించిందని, కొర్ను మోహిని 427, కరణం తులసి 415 మార్కులు సాధించినట్లు వివరించారు. ఎంపీసీలో కొటివాడ లాస్యప్రియ, పీస మాధురి 463 మార్కులతో అదరగొట్టగా, రేగాటి యశ్వంత్ 462, ఈశురు జనని, బెవర యశ్వంత్ 459 మార్కులు, కె.శశికుమార్ 458, నక్క తరుణ్‌సాయి 457, బి.లాస్య, జి.జోత్స్న 456 మార్కులతో సత్తాచాటారని పేర్కొన్నారు. కార్యక్రమలో కరస్పాండెంట్ వై.సారికారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి

రాజ్యాంగ రూపకర్త, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజక వర్గాల వ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశానికి అంబేడ్కర్ అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కళింగ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, పప్పల రమేష్ తదితరులు



శ్రీకాకుళం పీఎన్ కాలనీ: అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణ, పొన్నాడ రుషి తదితరులు



గార: పెద్ద అంబటివానిపేట ఎస్సీ కాలనీ వద్ద నినాదాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు



రణస్థలం: జె.ఆర్.పురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



శ్రీకాకుళం క్రైమ్ : అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, అధికారులు



శ్రీకాకుళం అర్బన్: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీఎస్ఎన్ఎల్ ఈయూ నాయకులు



గార: అంపోలులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు



ఎచ్చెర్ల క్యాంపస్: ట్రిపుల్ ఐటీలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ఏవో ముని రామకృష్ణ



శ్రీకాకుళం అర్బన్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు



శ్రీకాకుళం అర్బన్‌కాంప్లెక్స్ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీపీటీవో విజయ్‌కుమార్



ఎచ్చెర్ల క్యాంపస్: అంబేడ్కర్ వర్సిటీలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ఎచ్చెర్లలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న స్థానిక యువత



శ్రీకాకుళం న్యూకాలనీ: ఆర్ట్స్ కళాశాలలో అంబేడ్కర్ జయంతి వేడుకలు



శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు



శ్రీకాకుళం పాతబస్టాండ్: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న బార్ ప్రతినిధులు, న్యాయవాదులు



శ్రీకాకుళం న్యూకాలనీ: హయాతీనగరం గురుకుల పాఠశాలలో నివాళ్లర్పిస్తున్న ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి



శ్రీకాకుళం న్యూకాలనీ: అంబేడ్కర్ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న బీజేపీ నాయకులు



శ్రీకాకుళం న్యూకాలనీ: యూటీఎఫ్ భవన్‌లో అంబేడ్కర్‌కు నివాళ్లర్పిస్తున్న సంఘ ప్రతినిధులు



శ్రీకాకుళం అర్బన్: గాంధీ మందిరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు



జి.సిగడాం: మండల కేంద్రం జిసిగడాంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్



శ్రీకాకుళం రూరల్: బైరివానిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గ్రామస్తులు



శ్రీకాకుళం పీఎన్ కాలనీ: నివాళులు అర్పిస్తున్న ఎస్ఎస్ఆర్ చారిట్రబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీను



శ్రీకాకుళం పీఎన్ కాలనీ: నివాళులు అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు